ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
మంగళవారం 30 ఏప్రిల్ 2024



నేడు రేగొండలో.. కాంగ్రెస్ జనజాతర



సభకు హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

- పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల నుంచి భారీగా జన సమీకరణ
- ఎండ తీవ్రత దృష్ట్యా షామియానాల ఏర్పాటు
- సభికుల కోసం మజ్జిగ, తాగునీటి సదుపాయం
- మధ్యాహ్నం 3గంటలకు సభ.. యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు

భూపాలపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో జనజాతర సభ జరగనుంది. ఈ సభకు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరు కానుండగా ముఖ్యంగా పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల నుంచి 75వేలమందికి పైగా జనసమీకరణ చేస్తున్నారు. ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు కసరత్తు పూర్తి చేశారు. వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న కడియం కావ్య సీనియర్ నేత కడియం శ్రీహరి కుమార్తె కావడం, ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారిన నేపథ్యంలో వ్యూహాత్మకంగానే ఈ సభ నిర్వహిస్తున్నారని,

మిగతా 8వ పేజీలో..

అభ్యర్థుల లెక్క తేలింది..

- వరంగల్‌లో 42 మంది.. మానుకోటలో 23 మంది
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

7లో..



ప్రజలకు అభివాదం చేస్తున్న నడ్డా, పక్కన మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్



సభకు హాజరైన ప్రజలు

బీజేపీతోనే.. అభివృద్ధి

- పదేళ్ల పాలనలో అన్నిరంగాల్లోనూ పురోగతి
- జాతీయ రహదారులకు మహర్దశ
- రామప్పకు యునెస్కో గుర్తింపునిచ్చింది బీజేపీయే
- గిరిజన యూనివర్సిటీకి సమ్మక్క-సారలమ్మ పేరు
- మానుకోట జనసభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



నడ్డాకు గజమాల వేస్తున్న నాయకులు

మహబూబాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, బీజేపీ పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లోనూ పురోగతి సాధించి దేశం అభివృద్ధిలో అగ్రబాగానికి చేరిందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మానుకోట జనసభను సోమవారం నిర్వహించారు. ఈ సభకు హాజరైన నడ్డా మాట్లాడుతూ దేశంలోని జాతీయ రహదారులకు మహర్దశ కల్పించేందుకు కృషి చేశామని, హైదరాబాద్ నుంచి మహబూబాబాద్ మీదుగా భద్రాచలం వరకు జాతీయ రహదారి నిర్మించడంతో పాటు పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో హైదరాబాద్ తరహాలో పాస్‌పోర్టు కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత బీజేపీదేనన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన చరిత్ర ప్రధాని మోదీదని, ప్రసిద్ధ రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు ఇవ్వడంతో పాటు జాతీయ గిరిజన యూనివర్సిటీని ములుగులో ఏర్పాటు చేసి సమ్మక్క-సారలమ్మ పేరిట నామకరణం చేశామన్నారు.

ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తే మరింత అభివృద్ధి..

మానుకోట పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హామీ ఇచ్చారు. అంతేకాకుండా మానుకోట మునిసిపాలిటీని అమృత్ పథకంలో చేర్చేలా కృషి చేస్తామని, బంజారాల సమస్యల పరిష్కారానికి పాటుపడతామన్నారు. ఏకలవ్య రెసిడెన్షియల్, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని పేర్కొన్న ఆయన తమ ప్రభుత్వం ఎంతో ధైర్యంగా 370 ఆర్టికల్‌ను రద్దు చేసిందని, ఎస్టీల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు చేపట్టిందని తెలిపారు. తమ పాలనలో 25కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని, 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ ఇస్తున్నామని, ఈ పథకాలు మరో ఐదేళ్లు కొనసాగిస్తామని చెప్పారు. నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించి ఇచ్చిన తాము మరో మూడు కోట్ల ఇళ్లు కట్టిస్తామని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా 70ఏళ్ల పైబడిన వారికి చికిత్స లభిస్తోందని, త్వరలోనే పైపులైన్ ద్వారా ఇంటింటికి గ్యాస్ సరఫరా చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీ లక్ష్మణ్, మానుకోట ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్, జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎడ్ల అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, యాప సీతయ్య, వద్దిరాజు రాంచందర్‌రావు, చీకటి మహేష్‌గౌడ్, మోసంగి మురళి, సింగారపు సతీష్, భూక్య సంగీత, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, దార ఇందుభారతి, పల్లె సందీప్, చుక్కల నరేష్, సిరికొండ సంపత్, వల్లభు వెంకటేశ్వర్లు, క్యామవల్ శ్యాంసుందర్‌శర్మ, ఆకుల శ్రీనివాస్, రాధాపటేల్, మదన్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశీర్వదించి గెలిపిస్తే 24 గంటలు ప్రజా సేవలో ఉంటా

- బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్

మహబూబాబాద్ రూరల్, మే 29: దేశంలో మళ్లీ బీజేపీదే అధికారమని, మూడోసారి ప్రధానిగా మోదీనేనని, తనను ఆశీర్వదించి గెలిపిస్తే 24గంటలు ప్రజాసేవలో ఉంటానని ఆ పార్టీ మానుకోట ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ పేర్కొన్నారు. సోమవారం జరిగిన మానుకోట జనసభలో మాట్లాడిన ఆయన బీఆర్ఎస్ తెలంగాణ ద్రోహులకు టిక్కెట్లు

మిగతా 8వ పేజీలో..

ముందుగానే వచ్చిన నడ్డా... గంట పర్యటనలో.. అరగంట ప్రసంగం..

ప్రధాని మోదీ.. జై శ్రీరామ్ నినాదాలు సోమవారం మిట్ట మధ్యాహ్నం జరిగిన బీజేపీ మానుకోట జనసభ విజయవంతమైంది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా అధికారిక షెడ్యూల్ ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 3 గంటలకు మహబూబాబాద్ సభా వేదికపై ప్రసంగించాల్సి ఉంది. కానీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీ లక్ష్మణ్, మానుకోట అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌తో కలిసి వచ్చిన ఆయన అక్కడ్నుంచి నేరుగా కారులో ఎన్టీఆర్ స్టేడియంలోని సభావేదికపైకి సరిగ్గా 2.21 గంటలకు చేరుకున్నారు. పది నిమిషాల పాటు ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ ప్రసంగించిన అనంతరం 2.31 గంటలకు జేపీ నడ్డా ప్రసంగం ఆరంభమైంది. 30 నిమిషాల పాటు అనర్గళంగా తన ప్రసంగాన్ని కొనసాగించి 3.01 గంటలకు ముగించారు. ఆ తర్వాత పార్టీ శ్రేణులు ఆయన్ను సత్కరించాక హైదరాబాద్ తిరుగుపయనమయ్యారు. మానుకోట సభ మధ్యాహ్నం 3 గంటలకని ప్రకటించినా 12 గంటల నుంచే జనం రాక ప్రారంభమైంది. ఇక సభలో ప్రధాని మోదీ.. జైశ్రీరామ్ నినాదాలు వినిపించాయి.



మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ దగ్గర ఓ చిన్న హోటల్‌లో ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి కాఫీ తాగుతున్న కేసీఆర్

వరంగల్ లోక్‌సభ స్థానం మనదే.. క్షేత్రస్థాయిలో పనిచేయండి..

- బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం
- బస్సు యాత్రకు నీరాజనాలు

7లో..

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- డీఎంహెచ్‌వో కళావతిబాయి



జంగిలిగొండ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 29 : మహబూబాబాద్ జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో బి.కళావతిబాయి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాల, జంగిలిగొండ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను సోమవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో కళావతిబాయి మాట్లాడుతూ.. ప్రాథమిక చికిత్సలు, ఆరోగ్య సలహాలు తగిన విధంగా ప్రజలకు అందుబాటులో ఉండి అందించాలని సూచించారు. వేసవి కాలంలో కావాల్సిన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, కె.మంగమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం

మానుకోట ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 29 : కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో సోమవారం ఉదయం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో దేశం, బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ప్రధాని మోదీ పేదలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తే.. మాజీ సీఎం కేసీఆర్ అవినీతికి పాల్పడుతూ తన కుటుంబ సభ్యుల ఆస్తులను పెంచారని దుయ్యబట్టారు. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీ మాత్రం ఎండనక, వాననక భారత్ జోడో యాత్ర చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. అలాంటి వ్యక్తి దేశ ప్రధాని అయితే భారత్ మరింత అభివృద్ధి చెందనుందని పేర్కొన్నారు. తాను కేంద్ర మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశానని, మరో సారి ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే ప్రజాభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, నారోజు సత్యమనోరమ, ఎ ల్లండి వెంకటరెడ్డి, గుగులోతు వెంకట్‌నాయక్, ఎడ్ల రమేష్, రామగోని రాజు, భూక్య లక్ష్మి, విజయలక్ష్మి, రవినాయక్, స్వర్ణలత, వంశీ, శంకర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో ప్రచారంలో భాగంగా ఓ హోటల్‌లో పూరీలు కాలుస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్



వేమునూర్‌లో ఉపాధి కూలీలతో కలిసి పనిచేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

వేంనూర్, కిష్టాపురంలో ఎమ్మెల్యే ప్రచారం..

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపును కోరుతూ మహబూబాబాద్ పట్టణంతో పాటు వేంనూర్, కిష్టాపురం గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో వంద రోజుల పాలనలో ఐదు అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదని చెప్పారు. అత్యధిక స్థానాల్లో ఎంపీ సీట్లు గెలిపించుకుని రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని కోరారు. కాంగ్రెస్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్, ఉపేందర్, వినయ్, బండి వెంకన్న, నాళ్ల లక్ష్మీనర్సింహరావు, ప్రసాద్, సదాశివుడు, నిమ్మల శ్రీను, శంతన్ రామరాజు, బోనగిరి గిరిధర్‌గుప్తా, సిరిపురం వీరన్న, పింగ్రాల రాందాసు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29: జిల్లాలో మే 1వ తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభమవుతాయని జిల్లా యువజన క్రీడల అధికారి బి.అనిల్ కుమార్ సోమవారం తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అండ్ చైర్మన్, జిల్లా క్రీడా మండలి అనుమతితో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరాలు మే 1న ప్రారంభమై 31వరకు కొనసాగుతాయని తెలిపారు. కురవి మండల కేంద్రంలో అథ్లెటిక్స్-వ్యాయామ ఉపాధ్యాయుడు సింధువర్మ (9160253548), కేసముద్రం మండల కల్వలలో బేస్‌బాల్-వ్యాయామ ఉపాధ్యాయుడు బి.బాలోజి (72075 03828), మరిపెడ మండలం తానంచర్లలో తైక్వాండో-వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.మానస(83676 82925), గార్లలో బాస్కెట్‌బాల్-వ్యాయామ ఉపాధ్యాయుడు బి.చంద్రశేఖర్(98669 94947), నర్సింహులపేట మండలం కొమ్ములవంచలో కబడ్డీ-వ్యాయామ ఉపాధ్యాయుడు టి.సురేష్ (99494 56079), తొర్రూరు మండలం పోలెపల్లిలో కబడ్డీ-వ్యాయామ ఉపాధ్యాయుడు

మిగతా 8వ పేజీలో..

మార్కెట్‌ను యథావిధిగా నడిపించాలి

- రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాజన్న, సుధాకర్
- వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 29 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మూడు రోజులు మాత్రమే క్రయవిక్రయాలు కొనసాగుతాయని అధికారులు ప్రకటించడం సబబు కాదని, మార్కెట్‌ను యథావిధిగా నడిపి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు గునిగంటి రాజన్న, నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి కార్యదర్శి శంషీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మార్కెట్‌లో తాగునీటితో పాటు రూ.5లకే సబ్సిడీ భోజనం ఏర్పాటు చేయాలని, ఈ వేసవిలో కార్మికులకు, రైతులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మార్కెట్‌లో ప్రస్తుతం వరి సీజన్ నడుస్తుందని, ధాన్యం అత్యధికంగా వస్తుండడంతో వారానికి మూడు రోజులు మాత్రమే కొనుగోళ్లు చేపడుతామని చెప్పడం సరికాదన్నారు. మూడు రోజులు మార్కెట్ బంద్ ఉండడం వల్ల చిల్లర కాంటాలకు, ప్రైవేట్ వ్యాపారులకు సహకరించినట్లు అవుతుందని చెప్పారు.

దీంతో రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ సమస్యపై అధికారులు స్పందించకుంటే రైతులను భారీగా సమీకరించిన ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడు తామని వారు హెచ్చరించారు.

చార్జీల చెల్లింపులపై చర్చలు విఫలం

- మార్కెట్ బయటి కొనుగోళ్లపై వివాదం
- వచ్చే నెల 4కు వాయిదా

కేసముద్రం, ఏప్రిల్ 29 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని వ్యాపార సంస్థల వద్ద కొనుగోళ్లలో కార్మికుల చార్జీల చెల్లింపుల్లో ఏర్పడిన వివాదంపై వ్యాపారులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. స్థానిక మార్కెట్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిపిన చర్చల్లో వ్యాపారులు, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మార్కెట్ వెలుపల వ్యాపార సంస్థల వద్ద రైతుల నుంచి సరుకులను కొనుగోలు చేస్తున్నారని, ఈ కొనుగోళ్లలో రైతుల నుంచి హమాలీ, కూలీ, దడువాయికి బస్తాకు రూ.18.50 చొప్పున వసూలు చేస్తున్నారని తెలిపారు. అయితే ఈ చార్జీలను కార్మికులకు తక్కువగా ఇస్తున్నారని, కొంత మంది వ్యాపారులు తక్కువ కొనుగోళ్లను చూపుతూ చార్జీలను తగ్గిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై వ్యాపారులు వాయిదా కోరడంతో చర్చలు వచ్చే నెల 4కు వాయిదా పడ్డాయి. ఈ చర్చల్లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, వోలం మురళి, చిదిరాల వసంతరావు, బిజ్జాల వెంకటేశ్వర్లు, శ్రీరాం వెంకటేశ్వర్లు, చంద్రన్‌కుమార్, ప్రదీప్, ప్రమోద్, ఆగె నాగరాజు, కొల్లూరు రమేష్, కార్మిక సంఘాల నాయకులు శివ్వారపు శ్రీధర్, కంచ వెంకన్న, దడువాయి సంఘం నాయకులు ఎర్రంశెట్టి అశోక్‌కుమార్, అంగోత్ మంగీలాల్ పాల్గొన్నారు.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో చర్చలు జరుపుతున్న కార్మికులు, వ్యాపారులు

నిప్పుల కొలిమి

- భానుడి భగభగతో జనం విలవిల
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- అత్యధిక ఎండతీవ్రత నమోదైన రెండో జిల్లాగా ములుగు
- మూడో జిల్లాగా జయశంకర్ భూపాలపల్లి



వరంగల్-నర్సంపేట రహదారి కోటగండి వద్ద ఎండమావులు కనిపిస్తున్న దృశ్యం

హనుమకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : భానుడు భగ్గుమంటున్నారు. నిప్పుల కొలిమిని తలపిస్తుండటంతో జనం విలవిల్లాడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. దీనికితోడు వడగాలులతో ప్రజలు అల్లాడుతున్నారు. సోమవారం రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత రికార్డయిన జిల్లాల్లో నల్లగొండ మొదటి స్థానంలో ఉండగా, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. నల్లగొండ జిల్లా మాగుడలపల్లిలో అత్యధికంగా 45.4 డిగ్రీలు నమోదవగా, ములుగు జిల్లా మంగపేటలో 45.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో 45.2 డిగ్రీలు రికార్డయింది. మహబూబాబాద్ జిల్లాలో 44.9 డిగ్రీలు, వరంగల్‌లో 44.4 డిగ్రీలు, హనుమకొండలో 44.3 డిగ్రీలు, జనగామలో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వారం రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సగటున 42 నుంచి 45డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ తీవ్రత, వడగాలులకు చిన్నపిల్లలు, వృద్ధులు తట్టుకోలేకపోతున్నారు. మధ్యాహ్నం బయటకు అడుగు పెట్టాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. అయితే ఎండలు మండుతున్నవేళ వాతావరణశాఖ కాస్త చల్లటి కబురు అందించింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని తెలిపింది.

వడదెబ్బతో ముగ్గురి మృతి.. మృతుల్లో అంగన్‌వాడీ టీచర్

వడదెబ్బ కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సోమవారం ముగ్గురు మృతిచెందారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సాలార్‌తండాకు చెందిన భూక్యా మల్సూర్(45) హమాలీ కార్మికుడు సోమవారం పనికి వెళ్లిన మధ్యాహ్నం ఇంటికి వచ్చి సొమ్మసిల్లిపడిపోయాడు. అతడిని కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం అమ్మపాలేనికి చెందిన వేముల ఉప్పలయ్య(46) కూలీ పనులకు వెళ్లిన క్రమంలో వడదెబ్బకు గురై సోమవారం మృతి చెందాడు. వరంగల్ జిల్లా గిర్మాజీపేట కాలనీకి చెందిన రామగిరి ప్రేమలీల(70) అనే అంగన్వాడీ టీచర్ 40ఏళ్లుగా ఏటూరు నాగారం మండలంలోని భూటారంలో నివసిస్తోంది. అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్న ఆమె ఐదురోజుల క్రితం వడదెబ్బకు గురైన ఆమె సోమవారం ఉదయం తన ఇంట్లో కుప్పకూలడంతో గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది.

'ఓపెన్' పరీక్షల నుంచి ఇద్దరు ఇన్విజిలేటర్ల తొలగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29: ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్షల్లో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఇన్విజిలేటర్లను పరీక్షల ఉమ్మడి జిల్లా ప్రత్యేక పరిశీలకుడు పి.రాజీవ్ విధుల నుంచి తొలగించారు. సోమవారం హనుమకొండ వరంగల్, ములుగు జిల్లాలోని వివిధ పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా పరకాలలోని టీఎస్ఆర్‌డబ్ల్యు ఎస్-బి సెంటర్‌లో కాపీకి పాల్పడుతున్న విద్యార్థిని డీబార్ చేస్తూ అక్కడ విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించారు. ఇక ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల కేంద్రంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని మట్టెవాడ ప్రభుత్వ పాఠశాల కేంద్రాన్ని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావుతో కలిసి సందర్శించారు.

కేసీఆరే పెద్ద మోసగాడు

● రాజకీయంగా ఎదుర్కోలేక నన్ను టార్గెట్ చేశాడు ● వరంగల్ అంటే కేసీఆర్‌కు గిట్టదు ● ప్రశ్నించే గొంతుకలు ఉంటాయని భయం
● ప్రజాస్వామ్య పరిరక్షణకు కావ్యను గెలిపించాలి ● స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 29: వరంగల్ రోడ్ షోలో తనను మోసగాడని అంటున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే అసలైన పెద్ద మోసగాడని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. తాను ఎక్కడ మోసాలకు పాల్పడ్డానో కేసీఆర్ బయటపెట్టాలని శ్రీహరి సవాల్ విసిరారు. కేసీఆర్, ఆయన కుటుంబం చేసిన అక్రమాలు, మోసాలు ప్రజల ముందుకు వస్తున్నాయన్నారు. సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు.

కేసీఆర్ తనను రాజకీయంగా ఎదుర్కొలేక టార్గెట్ చేసి నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ నిజ స్వరూపం భయంకరంగా ఉంటుందని కడియం శ్రీహరి ఆరోపించారు. కేసీఆర్ మోసపూరిత వైఖరి, కుట్రలు, అక్రమాలను దగ్గరగా చూసిన వాడిగా చెబుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఓఆర్ఆర్ చుట్టూ వేల కోట్ల విలువ చేసే భూములు కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు కాజేశారని ఆరోపించారు. రైతులు, భూ యజమానులు, నిరుపేదలను భయపెట్టి భూములు లాగేసుకున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ కవిత తీరుతో కేసీఆర్ సిగ్గుపడాలని శ్రీహరి విమర్శించారు. కవిత నిర్దోషి అయితే ఎందుకు బెయిల్ రావడం లేదని శ్రీహరి ప్రశ్నించారు. కవిత వల్లనే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ జైలుకు వెళ్లాడని వ్యాఖ్యానించారు. ఉద్యమాల గడ్డ ఓరుగల్లు అంటే కేసీఆర్‌కు గిట్టదని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఇక్కడ ప్రశ్నించే, చైతన్యవంతమైన గొంతుకలు ఉంటాయని, ఇది తనకు ప్రమాదకరమని భావించే


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వరంగల్ జిల్లాను కేసీఆర్ ఆరు ముక్కలుగా విభజించారన్నారు. నగరానికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ తీసుకురాలేదని, మాస్టర్‌ప్లాన్ విడుదల చేయలేదని, ఇవన్నీ కూడా వరంగల్‌పై కేసీఆర్‌కు ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. కేయూలో జరిగిన ఘటన భయాందోళనలకు గురి చేస్తోందని కడియం శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. లౌకిక వాదం, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావిస్తూ ఈ పరిణామాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు.

రానున్న మూడు నెలల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ దుకాణం బంద్ కానున్నట్లు శ్రీహరి చెప్పారు. భూకబ్జాదారుడు అరూరి రమేశ్‌ను బీజేపీలోకి పంపించిందే కేసీఆర్ అని ఆరోపించారు. బీజేపీతో కేసీఆర్ కుమ్మక్కు అయ్యారని, లోక్‌సభ ఎన్నికల్లో డమ్మీ అభ్యర్థులను బరిలో నిలుపారని చెప్పారు. మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టరు టి. రాజయ్యను చూస్తే జాలి వేస్తోందని కడియం శ్రీహరి చెప్పారు. రాజయ్యను తన ఫామ్‌హౌస్‌లోకి కేసీఆర్ అడుగు పెట్టనివ్వలేదన్నారు. ఈ తరుణంలో రాజయ్య కేసీఆర్ రోడ్ షోలో డ్యాన్సులు వేయడం, డప్పు కొట్టడం చూస్తే జాలి వేస్తోందని పునరుద్ఘాటించారు. నరేంద్రమోదీ మళ్లీ ప్రధానమంత్రి అయితే దేశంలో వినాశనమే అని కడియం శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. కులం, మతం పేరిట రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ వరంగల్ నగరానికి చేసిన అభివృద్ధి అంటూ ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే అభివృద్ధి పట్టాలెక్కి పరుగులు తీస్తోందన్నారు. పశ్చిమలో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ నెల 24న మడికొండలో జరిగిన జన జాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా అభివృద్ధికి స్పష్టమైన హామీలు ఇచ్చిన సంగతి గుర్తుచేశారు. పట్టభద్రుల విభాగం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న) మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకోసం మోదీని ఓడించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, బీజేపీ దొందు దొందేనని చెప్పారు.

కాగా, బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నాతో పాటు ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి పార్టీ కండువాలతో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంక సరళా, కూచన రవళి, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, డాక్టర్ శ్రవణ్‌కుమార్, అజీజ్‌ఖాన్, తాడిశెట్టి విద్యాసాగర్, కూర వెంకట్‌తో పాటు కార్పొరేటర్లు తోట వెంకన్న, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ లోక్‌సభ స్థానం మనదే..

క్షేత్రస్థాయిలో పనిచేయండి.. : బీఆర్ఎస్ నేతలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం



బస్సులో ఖమ్మం వెళుతున్న మాజీ సీఎం కేసీఆర్

రాంనగర్, ఏప్రిల్ 29: 'వరంగల్ లోక్‌సభ స్థానం మనం గెలుస్తున్నాం.. నేతలంతా ఫీల్డ్ వర్క్ చేయండి..' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నేతలకు సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నగరంలో రోడ్ షో నిర్వహించిన కేసీఆర్.. రాత్రి హనుమకొండలోని మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు నివాసంలో బస చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, సారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, సతీష్‌బాబు తదితరులతో భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. సర్వేలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయని, మనమే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. నేతలు ఫీల్డ్ వర్క్ చేయాలని సూచించారు. సభ సక్సెస్ కావడంపట్ల నేతలను ప్రశంసించారు. కేడర్‌లో మంచి జోష్ ఉందని తెలిపారు. కేడర్‌కు భరోసా ఇస్తూ ప్రచారం చేయాలని, సుధీర్‌కుమార్ గెలుపునకు నేతలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కాగా, కేసీఆర్ సోమవారం వినయభాస్కర్‌తో పాటు కొంతమంది ఉద్యమకారులను మినహా ముఖ్యనేతలను ఎవరినీ కలువలేదు. సాయంత్రం ఎన్నికల ప్రచారం కోసం కేసీఆర్ బస్సులో ఖమ్మం బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఖమ్మం, కొత్తగూడెంలో ప్రచారం నిర్వహించి అక్కడే బస చేస్తారు. బుధవారం మహబూబాబాద్‌లో రోడ్ షోలో పాల్గొని రాత్రికి హనుమకొండలోని కెప్టెన్ నివాసానికి చేరుకుని ఇక్కడే బస చేయనున్నారు. మొత్తంగా నగరంలో కేసీఆర్ రోడ్ షో సక్సెస్ కావడం నేతలు, క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

కేసీఆర్ బస్సు యాత్రకు నీరాజనాలు

తొర్రూరు: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రచార సభలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వరంగల్ నుంచి ఖమ్మం సభకు వెళ్తున్న క్రమంలో సోమవారం సాయంత్రం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో బస్సులో నుంచే ప్రజలకు అభివాదం చేశారు. ఈ క్రమంలో కార్యకర్తలు 'జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ కాసేపు ఆగిన కేసీఆర్.. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, తదితర నేతలున్నారు.

బజ్జీలు తిని.. కాఫీ తాగి..

మరిపెడలో స్థానికులతో మాట్లాడిన కేసీఆర్

మరిపెడ, ఏప్రిల్ 29: వరంగల్‌లో ఆదివారం రాత్రి బస్సుయాత్ర, కార్నర్‌మీటింగ్ పూర్తిచేసుకున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. సోమవారం సాయంత్రం ఖమ్మంలో జరిగే బస్సుయాత్ర, సభకు వెళుతూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ దగ్గర ఆగారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి రోడ్డు పక్కన ఉన్న ఓ చిన్న హోటల్‌లోకి వెళ్లిన ఆయన.. బజ్జీలు తిని, కాఫీ తాగారు. కేసీఆర్‌ను చూసిన జనాలు కొందరు అక్కడికి చేరుకోగా ఆయన వారి బాగోగులను అడిగారు. ఆ తర్వాత కేసీఆర్ రైతులను పలకరించగా.. రైతులు తమ కష్టాలను ఏకరువు పెట్టారు. దాంతో ఏ మాత్రం ధైర్యం చెడొద్దని రానున్నవన్ని మంచి రోజులేనని వారికి భరోసానిచ్చారు.


మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ దగ్గర ఓ హోటల్‌లో స్థానికులతో ముచ్చటిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

నిబంధనల మేరకే గుర్తుల కేటాయింపు

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 29: ఎన్నికల సంఘం నిబంధనల మేరకే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తుల కేటాయించినట్లు వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, వరంగల్ ప్రావీణ్య తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు బండారి స్వాగత్ రణ్‌వీర్ చంద్ సమక్షంలో అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు జరిపారు. అనంతరం ప్రావీణ్య మాట్లాడుతూ రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీలకు ప్రత్యేకంగా ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించిందని, ఎన్నికల సంఘంచే గుర్తింపు పొందని, రిజిస్టర్ కాని, స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు తెలుగు అక్షరమాల ప్రామాణికంగా గుర్తులు కేటాయించినట్లు తెలిపారు. ఒకే గుర్తును ప్రతిపాదించిన ఇద్దరు అభ్యర్థులకు డ్రా పద్ధతిలో గుర్తు కేటాయించామన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సహాయ ఆర్‌ఓ కె.శ్రీనివాస్, ఏఆర్‌ఓలు డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, రాధిక గుప్తా, పీయూష్ కుమార్, డిఎస్.వెంకన్న, రోహిత్‌సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, కె.వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల పోలీస్ నోడల్ అధికారులు, వివిధ పార్టీల నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య


ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కావ్య కులమేంటో బహిర్గతం చేయాలి

● ముస్లిం మత ప్రకారం వివాహం చేసుకుంటే ఎస్సీ సర్టిఫికెట్ చెల్లదు
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

వడ్డెపల్లి, ఏప్రిల్ 29: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీలో ఉన్న డాక్టర్ కడియం కావ్యది ఏ కులమో ఆమె తండ్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బహిర్గతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం కావ్య ముస్లిం మతం ప్రకారం వివాహం చేసుకుంటే ఎస్సీ సర్టిఫికెట్ వర్తించదని అన్నారు. ఎస్సీ సామాజికవర్గం కాని కడియం కావ్యకు వరంగల్ లోక్‌సభకు పోటీ చేసే అర్హతేలేదని మంద కృష్ణ మాదిగ అన్నారు. కడియం కావ్య కులంపై న్యాయపోరాటం చేస్తామని, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరిది బైండ్ల కులం కాదని, అసలు అతడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారే కాదని ఇంతకుముందు రేవంత్‌రెడ్డి అన్నారని మంద కృష్ణ గుర్తు చేశారు. ఆయన కులమేదో కడియం నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ ఎస్సీ సర్టిఫికెట్‌తో కడియం శ్రీహరి 40 ఏళ్లుగా నిజమైన దళితుల అవకాశాలను దోచుకుంటున్నాడని దుయ్యబట్టారు. కడియం కావ్యకు రిజిస్టర్ మ్యారేజ్ చేశారా? ముస్లిం సంప్రదాయం ప్రకారం పెళ్లి చేశారా? హిందూ మత ప్రకారం వివాహం జరిపించారా? అనేది కడియం శ్రీహరి స్పష్టం చేయాలని అన్నారు. ముస్లింను వివాహమాడిన కావ్యకు ముస్లిం మతమే వర్తిస్తుందని, ముమ్మాటికీ కడియం కావ్య ముస్లిమేనని మంద కృష్ణ స్పష్టం చేశారు. కడియం కావ్య వివాహంపై తమకు అనుమానాలు ఉన్నాయని చెప్పారు. కడియం కావ్య ఎస్సీ సర్టిఫికెట్ జారీపై తహసీల్దార్, ఆర్‌డీవో, కలెక్టర్‌తోపాటు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామని, న్యాయపోరాటానికి సైతం వెనుకాడబోమని మంద కృష్ణ తెలిపారు.

కడియం శ్రీహరికి నీతి, నిజాయితీ, విలువలులేని వ్యక్తి అని, నిజమైన దళితుల అవకాశాలను అనుభవిస్తున్నాడని మందకృష్ణ విమర్శించారు. కడియం కావ్య ఒకవేళ గెలిచినా.. ఉప ఎన్నిక తప్పదన్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఓటర్లు విజ్ఞతతో ఓటు వేసి తగిన తీర్పును ఇవ్వాలని మంద కృష్ణ మాదిగ కోరారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం తాను క్షమాపణ చెబుతాడని కడియం శ్రీహరి ప్రకటించడం హాస్యాస్పదమని అన్నారు. అసలు ఆయన ముఖమే చూడనని, అలాంటిది క్షమాపణ చెప్పడమేంటని ఎద్దేవా చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్దకు కడియం శ్రీహరిని లాక్కొచ్చి తప్పులన్నీ ఒప్పించి నేలకు ముక్కును రాయిస్తామని మందకృష్ణ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎంఎస్‌పీ వరంగల్ ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్‌తో పాటు జిల్లా నాయకులు జేరిపోతుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రోడ్డు షోలో నిబంధనలు పాటించని పలువురిపై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్29: మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం నిర్వహించిన రోడ్డుషోలో అనుమతులు లేకుండా గ్యాస్‌తో పేపర్లు చల్లుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేసినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం.. కేసీఆర్ రోడ్డుషో సందర్భంగా మర్కజీ సెంటర్‌లో రోడ్డుపై కొంతమంది వ్యక్తులు ఆటోలో గ్యాస్, బీఆర్ఎస్ జెండాలు ఏర్పాటు చేసుకొని పేపర్లను చల్లారు. అక్కడే ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సదరు వ్యక్తులను అనుమతులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ఎలాంటి అనుమతులు లేవని ఒప్పుకున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ లెక్చరర్ ఎ.శ్రీను ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్లు రహీమ్, శ్రీను, రంజిత్, సుధాకర్, స్వామిలపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశారు.

అభ్యర్థుల లెక్క తేలింది..

వరంగల్‌లో 42మంది.. మానుకోటలో 23మంది ● ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

వరంగల్ కలెక్టరేట్/ మహబూబాబాద్, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగియడంతో అటు వరంగల్, ఇటు మహబూబాబాద్ నియోజకవర్గాల బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. ఉపసంహరణ అనంతరం వరంగల్‌లో 42మంది, మానుకోటలో 23మంది బరిలో నిలిచారు. ఈనెల 18 నుంచి 25వతేదీ వరకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ జరగ్గా మొత్తం 58 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆ తర్వాత 26వ తేదీన నిర్వహించిన పరిశీలనలో 10మంది నామినేషన్లు తిరస్కరణకు గురవడంతో.. 48 మంది అభ్యర్థులు మిగిలారు. వారిలో ఆరుగురు సోమవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో బరిలో 42 మంది మిగిలారు. వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు చిన్నచితక పార్టీల నుంచి 15 మంది, స్వతంత్ర అభ్యర్థులు ఏకంగా 27మంది పోటీ చేస్తున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్‌కు తొలుత మొత్తం 30 మంది నామినేషన్లు వేయగా.. వారిలో పరిశీలనలో ఐదుగురి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. ఇక ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు సోమవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో బరిలో 23 మంది మిగిలారు.

ఉపసంహరించుకున్న అభ్యర్థులు

● వరంగల్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన ఇల్లందుల శోభన్‌బాబు, కుమ్మరి కన్నయ్య, బర్ల బాబు, మార్త రాజభద్రయ్య, డాక్టర్ విజయ్ కుమార్, ఇసంపెల్లి వేణు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

● మానుకోటలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు పోరిక సామ్యుల్, పోరిక అశోక్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

వరంగల్, మానుకోటల్లో బరిలో నిలిచింది వీరే..

వరంగల్ నియోజకవర్గం నుంచి మొత్తం 42మంది బరిలో నిలిచారు. అరూరి రమేశ్ (బీజేపీ), కడియం కావ్య (కాంగ్రెస్), మారపల్లి సుధీర్ కుమార్ (బీఆర్ఎస్), పంజా కల్పన (బీఎస్‌పీ), ఏఆర్.నేనా ప్రేమ్ రెడ్డి రిపిక (మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ), అంబోజు బుద్ధయ్య (అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), మాస్ సావిత్రి (ఎంసీపీఐ(యూ), గాదం మల్లేశ్ (జై భారత్ నేషనల్ పార్టీ), పెండెల దేవరాజ్ (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యూలర్), నర్మద ప్రవీణ్ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), పసుల రవి (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలె), బుంగ జ్యోతి రమణ (ఐక్య నేషనల్ పార్టీ), మచ్చ దేవేందర్ (విడుతలై చిరుతైగల్ కట్చి పార్టీ), మేకల సుమన్ (ధర్మసమాజ్ పార్టీ), ఎస్ పికే.సాగర్ (జై మహాభారత్ పార్టీ) బరిలో ఉన్నారు. వీరితో పాటు స్వతంత్రులుగా నామినేషన్లు వేసిన గాదెపాక అనిల్ కుమార్, కొయ్యడ నరేశ్, కొంగర అనిల్ కుమార్, గడ్డం చిరంజీవి, గన్నారపు రవీందర్, గనిపాక ప్రదీప్, ఆర్‌కే గణపురం, చిలుముల్ల సుజాత, చిలువేరు ప్రతాప్, తాటికాయల సతీష్‌బాబు, తాండ్ర ఈశ్వర్, తాళ్లపల్లి వెంకటయ్య, గజ్జి దయాకర్, పుట్ట వినోద్ కుమార్, పైతర అచ్యుత్, పోగల అశోక్, పోతరాజు నరసింహరాజు, జన్ను ప్రమీల, బరిగెల శివ, బొచ్చు రాజు, బొల్లం విజయ్ కుమార్, బాషిపాక సుధాకర్, మోత్కుపల్లి ప్రభాకర్, మంగళంపెల్లి ఆశయ్య, మంద నరేశ్, శనిగరపు రమేశ్‌బాబు, పోలెపాక రూప బరిలో ఉన్నారు.


నామినేషన్ ఉపసంహరించుకుంటున్నట్లు రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యకు లేఖ సమర్పిస్తున్న స్వతంత్ర అభ్యర్థి

● మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 23 మంది పోటీలో ఉన్నారు. అజ్మీర సీతారాం నాయక్(బీజేపీ), మాలోతు కవిత(బీఆర్ఎస్), కోనేటి సుజాత(బీఎస్పీ), పోరిక బలరాంనాయక్(కాంగ్రెస్), మైపతి అరుణ్‌కుమార్(ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), బుర్క కృష్ణవేణి(సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా), బానోత్ లింగన్న(బ్లూ ఇండియా పార్టీ), జాటోతు రఘువర్మ(ఆధార్ పార్టీ), రవ్వ భద్రమ్మ(ధర్మ సమాజ్ పార్టీ), వాంకుడోతు రవికుమార్(తెలంగాణ జాగీర్ పార్టీ), సోడె వెంకటేశ్వర్లు(గోండ్వానా దండకారణ్య పార్టీ), సోయం కన్నరాజు(గోండ్వానా గణతంత్ర పార్టీ) బరిలో నిలిచారు. ఇక స్వతంత్రులుగా బోడ అనిల్‌కుమార్, గుగులోతు శేఖర్‌నాయక్, చందా లింగయ్య, పాల్వంచ దుర్గ, డీవీ నాయక్, పడిగె ఎర్రయ్య, పాయం సింగరాజు, బానోత్ ప్రేమ్‌నాయక్, బానోత్ లింగ్యానాయక్, బోడ ప్రశాంత్, మోకాళ్ల మురళీకృష్ణ పోటీ చేస్తున్నారు.

డోర్నకల్ ఆడబిడ్డను ఆదరించండి

మానుకోట ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత



మాట్లాడుతున్న మాలోత్ కవిత

మరిపెడ, ఏప్రిల్ 29 : డోర్నకల్ నియోజకవర్గ ఆడబిడ్డను ఇక్కడి ఓటర్లు తనకు ఓట్లేసి ఆదరించాలని మానుకోట ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్‌ముఖ్య కార్యకర్తల సమావేశం మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ అధ్యక్షతన మరిపెడలోని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నవీన్‌రావు గెస్ట్‌హౌస్‌లో జరుగగా ఆమె పాల్గొని మాట్లాడారు. తాను పుట్టింది, పెరిగింది ఇక్కడేనన్నారు. ఇక్కడి ప్రజలతో విడదీయలేని అనుబంధం ఉందన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీ ఇస్తారని నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్న విషయాలను ఉదహరించారు. కాంగ్రెస్ పార్టీయే మోసాల పార్టీ అని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నవీన్‌రావు, జడ్పీవైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఓడీసీఎంఎస్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, మరిపెడ మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి, ఎంపీపీ అరుణరాంబాబు, జడ్పీటీసీ శారదరవీందర్, వైస్ ఎంపీపీ అశోక్ రెడ్డి, గిరిపురం శాస్త్రి, పిచ్చిరెడ్డి, నున్నా రమణ, తాళ్లపెల్లి శ్రీనివాస్, ఉప్పల నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



స్వాతి (ఫైల్)

నర్సింహులపేట, ఏప్రిల్ 29 : ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థిని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కొమ్ములవంచ శివారు రూప్లాతండా జీపీ పరిధి ఎర్రచక్రుతండాలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రచక్రుతండాకు చెందిన గుగులోతు భీమా-పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నకుమార్తె గుగులోతు స్వాతి(17) తొర్రూరులో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తి చేసింది. ఇటీవల వెలువడిన పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంటివద్ద ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున స్వాతి మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి భీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న ఎస్సై తెలిపారు. విద్యార్థి స్వాతి ఆత్మహత్య విషయం తెలుసుకున్న మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత జిల్లా ఆస్పత్రికి చేరుకుని స్వాతి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వరంగల్ అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలి

బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్



మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

పెద్దవంగర, ఏప్రిల్ 29 : వరంగల్ అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. సోమవారం పెద్దవంగర మండల కేంద్రంతో పాటు ఉప్పరగూడెం, వడ్డెకొత్తపల్లి, గంట్లకుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని సూచించారు. సామాజిక, ఆర్థిక, ఓటు దోపిడీ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ప్రజలు తరిమికొట్టాలన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయి నుంచి పటిష్ఠం చేస్తూ బీజేపీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో మూడోసారి బీజేపీ అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లేగ రామ్మోహన్‌రెడ్డి, కుమార్, రంగు రాములు, మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ యాదవ్, సాయిని ఝాన్సీ, ఉడుత శ్యామ్‌యాదవ్, ముద్రబోయినశ్రీకాంత్, ఆనంద్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై దృష్టి సారించండి : ఎంపీపీ

చిన్నగూడూరు, ఏప్రిల్ 29 : మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా నీటి సరఫరాపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ వల్లూరి పద్మ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా, వివిధ శాఖల అధికారులు హాజరై ప్రగతి నివేదికను చదివి సభకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు ఉంటే త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కాగా, మండల స్థాయి అధికారులు ఎలక్షన్ విధుల్లో ఉన్నందున సమావేశానికి హాజరు కాలేకపోయారని ఎంపీడీవో రామారావు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీవో యాకయ్య, వైద్యాధికారి ప్రవీణ్, ఆర్ఐ వెంకన్న, కో-ఆప్షన్ సభ్యులు మోసిన్‌బేగ్, ఎంపీటీసీ ఉదయమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తాం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



కాంగ్రెస్‌లో చేరుతున్న దేవేందర్‌రెడ్డికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

తొర్రూరు, ఏప్రిల్ 29: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తారని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరులో సోమవారం సాయంత్రం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో రైతు సమన్వయ సమితి మండల కో-ఆర్డినేటర్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న ఈజీఎస్ పనులు గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రారంభించినవేనని అన్నారు. బీజేపీ నాయకులు గొప్పలు చెప్పుకునేందుకు మోదీ ప్రారంభించారని దేవుడి పేరుతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో మాజీ మంత్రి దయాకర్‌రావు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదు అమలయ్యాయని, ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే మరో గ్యారెంటీ, మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ చేసి తీరతామని హామీ ఇచ్చారు. ప్రజలు బీజేపీ నాయకుల మాటలు నమ్మవద్దని హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించేందుకు నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు.

ఫౌండేషన్ పేరుతో వైద్య సేవలు : కడియం కావ్య

కడియం ఫౌండేషన్ పేరుతో గత పదేళ్లుగా తాను ఈ ప్రాంత ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నానని వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. ప్రధాని మోదీ బడుగుబలహీన వర్గాల ప్రజలను తక్కువ చేసి మాట్లాడుతూ మతం, దేవుడి పేరుతో రెచ్చగొడుతున్నారని విమర్శించారు. పాలకుర్తి ప్రజలు ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని గెలిపించిన విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఓటు వేసి భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు. 35 సంవత్సరాల నుంచి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా మహిళగా తనకు అవకాశం వచ్చిందని, ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, కాకిరాల హరిప్రసాద్, కె.నిరంజన్‌రెడ్డి, పెదగాని సోమయ్య, సోమ రాజశేఖర్, సుంచు సంతోష్, వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిల్కోడులో దొంగ అరెస్టు

డోర్నకల్, ఏప్రిల్ 29 : డోర్నకల్ మండలం చిల్కోడు గ్రామ శివారులోని గంగమ్మ ఆలయంలో ఈ నెల 9న రాత్రి చోరీకి పాల్పడిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్‌కు చెందిన మామిడి గోపి అనే వ్యక్తి ఇటీవల చిల్కోడు శివారులో ఉన్న గంగమ్మ ఆలయంలో చోరీకి పాల్పడ్డట్లు చెప్పారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గోపిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

బస్తాల మాయంతో స్తంభించిన మార్కెట్

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 29 : ఒక వ్యాపారికి సంబంధించిన ధాన్యం బస్తాలు మాయమైన సంఘటనతో సోమవారం మార్కెట్‌లో వేలం పాటలకు తీవ్ర అంతరాయం కలిగింది. వ్యాపారులు ఈ-నామ్‌లో ధాన్యం, ఇతర సరుకులకు వేలం వేయకపోవడంతో మార్కెట్ మధ్యాహ్నం వరకు స్తంభించిపోయింది. వివరాల్లోకి వెళితే... శుక్రవారం మార్కెట్‌లో భారీగా సరుకులు రావడంతో సగం బస్తాల వరకే కాంటాలు నిర్వహించారు. శనివారం మిగిలిన బస్తాలకు కాంటాలు జరుగుతున్న తరుణంలో ఒక వ్యాపారికి చెందిన 29 ధాన్యం బస్తాలు కాంటాలు అయి కుట్టు వేసి ఎగుమతికి సిద్ధం చేశారు. వాహనం రావడం ఆలస్యమైంది. అయితే మరో వ్యాపారి ఆ బస్తాలు తనవే అనుకుని తన వాహనంలో ఎక్కించుకుని వెళ్లిపోయాడు. తీరా అసలు ఖరీదు చేసిన వ్యాపారి తన ధాన్యం బస్తాలు మాయమయ్యాయని మార్కెట్ కార్యదర్శి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో సోమవారం ఈ విషయం తేలకపోవడంతో వ్యాపారులంతా ఏకమై మార్కెట్ కార్యాలయంకు చేరుకున్నారు. మార్కెట్ కార్యదర్శి శంషీర్, సూపర్‌వైజర్ రమేష్‌తో చర్చలు జరిపారు. దాంతో మార్కెట్ అధికారులు శుక్రవారం ఏ వ్యాపారి ఎంత ఖరీదు చేశారు. మార్కెట్‌లో కాంటాలు అయిన సరుకుల వివరాలు తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ఓ వ్యాపారి పొరపాటున బస్తాలను తీసుకువెళ్లినట్లు తేలింది. దాంతో తీసుకువెళ్లిన బస్తాలను తిరిగి కొనుగోలు చేసిన వ్యాపారికి ఇస్తామనడంతో వివాదం సద్దుమనిగింది. కాగా,ఉదయం 11.30 ప్రాంతంలో వ్యాపారులు సరుకు నాణ్యతను చూసి కొనుగోళ్లు చేపట్టారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

గూడూరు, ఏప్రిల్ 29 : వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వీరస్వామి అన్నారు. గూడూరులోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ బానోత్ సుజాత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు చేసిన అభివృద్ధి, చేపట్టిన పనుల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీరస్వామి మాట్లాడుతూ... ఎండలు తీవ్రంగా ఉన్నాయని, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి నీరందించే విధంగా మిషన్ భగీరథ అధికారులు, గ్రామ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. నీటి కొరత ఉన్నగ్రామాల్లో జీపీలకు అనుసంధానంగా ఉన్న నల్లాల బావుల ద్వారా నీటిని అందించారు. జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఖాసీం, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, ఎంపీటీసీలు కత్తి స్వామి, బోడ కిషన్, శంకర్, అధికారులు అల్లె రాకేష్, ప్రణయ్, అమ్ములు, శ్రీనివాసరెడ్డినిలోఫర్‌అజ్మీ, వైద్యులురాంబాబు, యమున పాల్గొన్నారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతలు



చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీ వద్ద బీజేపీ గ్రామ అధ్యక్షుడు గణేష్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 29 : మహబూబాబాద్ మండలం చిన్న కిష్టాపురంలో బీజేపీ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. వీరికి ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేసామని, మిగతా హామీలను త్వరలోనే అమలు చేస్తామని చెప్పారు. బీజేపీ నుంచి సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవినాయక్, మండల పార్టీ అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, ఎంపీటీసీ మంగీలాల్, నలమాస వెంకన్న, ఉపేందర్, రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఏబీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

మహబూబాబాద్ టౌన్ : మహబూబాబాద్‌లో తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు, అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఏబీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఇనుగుర్తి సుధాకర్ సోమవారం కాంగ్రెస్‌లోచేరారు. ఆయనకు ఎమ్మెల్యే మురళీనాయక్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం దక్కుతుందని చెప్పారు. కాంగ్రెస్‌లో కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి ఉదయ్‌చందర్ పాల్గొన్నారు.

బలరాం నాయక్ విజయానికి కృషి చేయాలి

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



బయ్యారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, ఏప్రిల్ 29 : మానుకోట పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ విజయానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. బయ్యారంలో సోమవారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు ఎలాంటి భేషజాలకు పోకుండా ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే అమలు చేస్తున్న ప్రజా సంక్షేమాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు పరిచిన విషయాన్ని ప్రజలకు తెలియపరుస్తూ ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంతేకాక మే 4వ తేదీన బయ్యారంలో జరుగు బహిరంగ సభను సక్సెస్ చేసేలా పనిచేయాలన్నారు. మండల వ్యాప్తంగా ఎక్కువ జన సమీకరణ జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


● గార్ల : మహబూబాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ విజయం కోసం సోమవారం గార్ల మండలం చిన్న కిష్టాపురం దేశ్యాతండా, మంగళితండా గ్రామాల్లో మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ నేతృత్వంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఈజీఎస్ పనుల ప్రదేశంలో కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బంజారాలను ఎస్టీ జబితాలోచేర్చి జీవితాల్లో వెలుగులు నింపిన కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి రుణం తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కస్నా నాయక్, రాహుల్ నాయక్, రాజేష్, జిల్లీ, మాన్‌సింగ్, సెట్రామ్, భద్రు, బాలాజీ, వీరన్న, భీముడు, హచ్చి, లక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

● గూడూరు: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి అన్నారు. గూడూరు మండలంలోని వడ్డెరగూడెం, కలకత్తాతండా, కోబల్‌తండా, మూడుగుడిసెల లైన్‌తండా, చిన్నఎల్లాపురం గ్రామాల్లో బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ... బలరాం నాయక్‌ను గెలిపిస్తే కేంద్రంలో మంచి పదవి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీని ప్రధాని చేయడం కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, బోయినపల్లి సతీష్‌రావు, ప్రదీప్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధు, వాంకుడోతు కొమ్మాలు, శివరాత్రి సంపత్, చంటి స్వామి, గంగయ్య, సూర శ్రీనివాస్, ఓర్సు నాగేందర్, వల్లపు నాగరాజు, కుంచపు సాంబయ్య, సూరయ్య, ఐలయ్య, వెంకన్న పాల్గొన్నారు.

బలరాంనాయక్ గెలుపు ఖాయం

మరిపెడ : మానుకోట కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు ఖాయమని ఆపార్టీ కాంగ్రెస్ నేతలు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, పెండ్లి రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మరిపెడలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో మరిపెడ మండల కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరుగగా వారు పాల్గొని మాట్లాడారు. బలరాంనాయక్ గెలుపు ఖాయమైనప్పటికీ భారీ మెజారిటీ కోసం ప్రతీ కార్యకర్త ఇంటింటికి వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలన గురించి వివరించి ఓట్లు అడగాల న్నారు. గతంకన్న మెజారిటీ వచ్చే విధంగా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు తాజుద్దీన్, గుగులోత్ రవినాయక్, కోట వెంకట్‌రెడ్డి, ఐలిమల్లు, అప్సర్, గంగయ్య, నర్సింహారెడ్డి, లక్ష్మయ్య, రమేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు మంగళహారతితో కవిత స్వాగతం



మరిపెడలో కేసీఆర్ బస్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న కవిత, హరిప్రియ

మరిపెడ, ఏప్రిల్ 29 : మాజీ సీఎం కేసీఆర్ ఖమ్మం పార్లమెంట్ సభకు బస్సు యాత్ర ద్వారా వరంగల్ నుంచి ఖమ్మంకు రోడ్డు మార్గాన వెళుతుండగా సోమవారం మరిపెడ గెస్ట్‌హౌస్ దగ్గర డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత మంగళహారతి పట్టి స్వాగతం పలికారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి గులాబీ పూలను బస్సుపై చల్లి జై కేసీఆర్ అంటూ నినాదించారు. మాజీ సీఎం కేసీఆర్ బస్సు నుంచే కార్యకర్తలకు అభివాదంచేశారు. ఆయన ప్రయాణించే బస్సులో ఎంపీ కవిత, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను వెంట తీసుకెళ్లారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నవీన్, డీఎస్ రవిచంద్ర, జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మరిపెడ మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్లు?

దంతాలపల్లి, ఏప్రిల్ 29 : మండల కేంద్రంలో ఆదివారం రాత్రి పలువురు గంజాయిస్మగ్లర్లను నార్కోటిక్ అధికారులు, పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. సదరు వ్యక్తులు గంజాయి విక్రయం జరిపేందుకు మండల కేంద్రం శివారు వ్యవసాయ పొలంలో మాటు వేయడంతో పోలీసులు దాడిచేసి తొమ్మిది మందిని అదుపులో తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. కాగా, మండల కేంద్రానికి చెందిన వ్యక్తులేవరనే దానిపై మండలంలో చర్చ జోరుగా జరుగుతుంది.

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

తొర్రూరు, ఏప్రిల్ 29 : తొర్రూరు పట్టణంలోని సాయిరాం డిగ్రీ కళాశాల యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమ్ఆద్మీ పార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలోత్ సురేష్ బాబు అన్నారు. సోమవారం విద్యార్థులతో కలిసి కళాశాల ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోమూడు నెలల క్రితం జరిగిన 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షల్లో సాయిరాం కళాశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే యూనివర్సిటీ 5వ సెమిస్టర్ ఫలితాలు విడుదలై నెల రోజులు కావస్తున్నా 5వ సెమిస్టర్ ఫలితాలు నేటికీ విడుదల చేయలేదని తెలిపారు. యూనివర్సిటీ అధికారులను సంప్రదించగా పరీక్షలు రాసిన వారి వివరాలు వెబ్‌సైట్‌లో లేవని తెలిపారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పవన్, మనోజ్, రమేష్, శివ, ఉదయ్, వెన్నెల, హారిక పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పంట నష్టం

కాలిన శ్రీగంధం చెట్లు.. మొక్కజొన్న కంకులు

బయ్యారం, ఏప్రిల్ 29 : ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో పంట నష్టం వాటిల్లిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం... బయ్యారం మండలం రెడ్యాతండాకు చెందిన బానోత్ భీమ 10 ఏళ్ల నుంచి రెండు ఎకరాల్లో శ్రీగంధం పంట సాగు చేస్తున్నాడు. దీంతో పాటు జగత్‌రావుపేట గ్రామానికి చెందిన బానోత్ రాంకోటి మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే సమీపంలో రగులుకున్న నిప్పు రాంకోటి చేనుకు అంటుకోవటంతో చేనులో కోసి వలవటానికి ఉంచిన మొక్కజొన్న కంకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో పాటు పక్కనే గల భీమ చేనుకు కూడా మంటలు వ్యాపించటంతో శ్రీగంధం చెట్లు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది.

బీజేపీని ఓడించి మోదీని గద్దె దించాలి

సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథి రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 29 : ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీని ఓడించి ప్రధాని మోదీని గద్దె దించాలని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని వీర భవన్‌లో సీపీఐ పట్టణ ఆర్గనైజేషన్ కమిటీ సమావేశాన్ని నర్రా శ్రావణ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ... దేశంలో ప్రధాని మోదీ శకం ముగిసిందని, బీజేపీకి వంద సీట్లు మించి రావన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి 350 సీట్లతో కేంద్రంలో అధికారంలోకి రానుందన్నారు. మానుకోటలో బలరాంనాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మే 3న 5వేల మందితో ఎన్నికల సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, తండా సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

నెల్లికుదురు, ఏప్రిల్ 29: విద్యుత్ ప్రమాదాల నివారణపై నెల్లికుదురు, దంతాలపల్లి విద్యుత్ సిబ్బందికి స్థానిక మోడల్ స్కూల్‌లో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈటీ సునితాదేవి మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది నిరంతర విద్యుత్ సరఫరా ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. టాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, సాంకేతికతపై అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు విద్యుత్ సిబ్బంది ఒకరికొకరు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో డీఈ మధుసూదన్, ఏడీఈ చలపతి రావు, ఏఈలు సింధు, ప్రవీన్, భార్గవి, వివిధ గ్రామాల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రులు ఆలోచించి ఓటువేయాలి

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

తొర్రూరు, ఏప్రిల్ 29 : రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. సోమవారం తొర్రూరులో ట్రస్మా ప్రైవేటు పాఠశాలల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలల్లోనే ఐదు గ్యారెంటీలు అమలు చేసినా ప్రజలను మభ్యపెట్టేందుకు తప్పుడు విమర్శలు చేస్తున్నారని, ప్రజలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్లమెంట్ అభ్యర్థులను బీఆర్ఎస్ పార్టీ డమ్మీలను పెట్టి పరోక్షంగా బీజేపీకి మద్దతు పలుకుతుందని, వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పేరు కూడా నియోజకవర్గంలో ఎవరికీ తెలియదన్నారు. బీజేపీ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ ఓట్లు లబ్ధిపొందాలని చూస్తుందన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని పథకాలను అమలు చేస్తారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, కాకిరాల హరిప్రసాద్, నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

ఇచ్చిందని, తనకు బీఆర్ఎస్ టిక్కెట్ ఇవ్వకుండా మోసం చేస్తే బీజేపీ ఆదరించిందన్నారు. తాను గతంలో మానుకోట ఎంపీగా పనిచేసిన సమయంలో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశానని, ఇంకా చేయాల్సి ఉందన్నారు. బీజేపీగెలిస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. తన మీద తనకు నమ్మకం లేక ఆయన దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నారని ఆరోపించారు. అబద్ధాల హామీలతో గద్దె నెక్కిన రేవంత్‌రెడ్డి వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో దోపిడీ, లంచగొండితనం పెరిగిందే తప్ప జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. మూడో సారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, మానుకోట పార్లమెంట్ స్థానంలో బీజేపీని గెలిపిస్తే కేంద్రం నిధులతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి జరగనుందన్నారు.

రేపటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

(5వ పేజీ తరువాయి)

టి.వంశీకృష్ణ(9948213518), మరిపెడ మండలం ఎల్లంపేటలో అథ్లెటిక్స్- వ్యాయామ ఉపాధ్యాయుడు ఐ.సురేష్(9666095914), నర్సింహులపేట మండలం జయపురంలో వాలీబాల్-వ్యాయామ ఉపాధ్యాయుడు వీరారెడ్డి(7989563037), ఇనుగుర్తిలో వాలీబాల్-వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ప్రణయ్(8886563878), కురవి మండలం రాజోలులో ఫుట్‌బాల్-వ్యాయామ ఉపాధ్యాయుడు డి.సునిల్(8790121901)లు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పైనసూచించిన వ్యాయామ ఉపాధ్యాయులను సంప్రదించాలన్నారు. ఈ వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు రేగొండలో కాంగ్రెస్ జనజాతర

(5వ పేజీ తరువాయి)

సభకు భారీగా జనాన్ని సమీకరించడం ద్వారా ప్రత్యర్థి పార్టీలపై పై చేయి సాధించాలన్న వ్యూహంతో కాంగ్రెస్ శ్రేణులు అడుగులు వేస్తున్నాయని తెలుస్తోంది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పరకాల ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేవూరి ప్రకాష్‌రెడ్డి సభ ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేయిస్తున్నారు. సోమవారం సాయంత్రానికి ఈ ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. అయితే ఎండల తీవ్రత నేపథ్యంలో సభకు హాజరయ్యేవారు ఇబ్బందులకు గురాకాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల ఏర్పాటు మొదలుకొని దారి పొడవునా సభకు వచ్చే వారి కోసం తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నారు. ఇందుకోసం 2.50లక్షల మజ్జిగ ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. సభా స్థలంలో 25వేల మంది కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లతో పాటు మరో 50 వేల మందికి సరిపడేలా షామియానాలను నిర్మిస్తున్నారు. ఉదయం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో జరిగే సభలో పాల్గొన్న తర్వాత రేవంత్‌రెడ్డి రేగొండ రానున్నారు. సీఎం రాక కోసం రేగొండలో హెలిప్యాడ్ నిర్మాణ పనులు కూడా పూర్తి చేశారు. ముఖ్యమంత్రి ప్రచార షెడ్యూల్ ప్రకారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట నుంచి బయల్దేరనున్న రేవంత్ రెడ్డి మధ్యాహ్నం 3గంటలకు హెలికాప్టర్‌లో రేగొండకు చేరుకొని జన జాతర సభలో పాల్గొంటారు. ఆయనతో పాటు ఈ సభకు మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ అలియాస్ సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తదితరులు కూడా హాజరు కానున్నారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి

సాలార్‌తండాలో హమాలీ కార్మికుడు.. అమ్మపాలెంలో కూలీ



మల్యార్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 29 : ఓ హమాలీ కార్మికుడు వడదెబ్బకు గురై మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సాలార్‌తండాలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... సాలార్‌తండాకు చెందిన భూక్య మల్యార్(45) తండాలో హమాలీ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత నాలుగు రోజుల నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో హమాలీ పనికి వెళ్లిన మల్యార్ మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోయాడు. అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మల్యార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, జిల్లి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

● డోర్నకల్ : డోర్నకల్ మండలం అమ్మపాలెంకు చెందిన వేముల ఉప్పలయ్య(46) అనే కూలీ వడదెబ్బకు గురై సోమవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మపాలెంకు చెందిన వేముల ఉప్పలయ్య కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత ఎక్కువ కావడం, వీస్తున్న వేడిగాలులకు వడదెబ్బతో అస్వస్థతకు గురై మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.